క్లుప్తంగా

31న దివ్యాంగులకు సహాయ పరికరాలు పంపిణీ



మల్లు సుబ్బనరసారెడ్డి

పుల్లంపేట : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు హెచ్ఎంఎం హైస్కూల్‌లో సెప్టెంబర్ నెలలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల సహాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 31వ తేదీ పరికరాలు అందించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. లబ్ధిదారులు 31వ తేదీ ఉదయం 8 గంటలకు హాజరై సహాయ పరికరాలు పొందాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకున్న దళితులు



భూ కబ్జాపై మాట్లాడుతున్న దళిత నాయకులు

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి పరిధిలోని జగనన్న కాలనీ లే అవుట్ సమీపంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చెన్నయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కొంత మంది ప్రయత్నిస్తుండగా తాము అడ్డుకున్నామని దళిత నాయకుడు పసతల రామచంద్రయ్య ఆదివారం తెలియజేశారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు నాలుగు ఎక్స్‌వేటర్లను పెట్టి 293 సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారన్నారు. ఆ భూమిని ఎన్టీపల్లి గ్రామానికి చెందిన పేద దళితులకే దక్కాలన్నారు. దీనిపై సోమవారం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

శరత్‌కుమార్‌రాజు సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట : ప్రముఖ న్యాయవాది, శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత కొండూరు శరత్‌కుమార్‌రాజుకు ఎక్సలెంట్ వాకర్ ఇంటర్నేషనల్ అవార్డు దక్కింది. ఈ విషయాన్ని ఆదివారం ఆయన ఇక్కడి విలేకర్లకు తెలియజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 33వ కన్వెన్షన్‌ను శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. రాజంపేట వాకర్స్ అసోసియేషన్ నుంచి ఒకరోజు 108 మంది మహాత్మ గాంధీ ఫెలోషిప్(ఎంజీఎఫ్) సభ్యత్వాలు చేసి శరత్ వాకర్స్ ఇంటర్నేషనల్ చరిత్రలో నిలిచిపోయారని పలువురు కొనియాడారు. అందుకు ప్రతిఫలంగా ఈ అవార్డు దక్కిందన్నారు.

సందడి వాతావరణంలో ఆత్మీయ సమ్మేళనం



టీచర్లను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఓబులవారిపల్లె : సంజీవపురం సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 2006 – 2007 పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 16 సంవత్సరాల తరువాత అందరూ ఒకచోట చేరడంతో అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. కార్యక్రమంలో రూ. 25 వేలు విలువచేసే బ్లూటూత్ స్పీకర్‌లను పాఠశాలకు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అన్నదానం

పెద్దతిప్పసముద్రం : తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ సభ్యుడైన మండలంలోని పట్టెంవాండ్లపల్లికి చెందిన హరీష్ భార్య క్రిష్ణవేణి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు అన్నదాన చేసినట్లు అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు భాగ్యమ్మ, రాజు, అనిల్ పేర్కొన్నారు.

గోతులమయం.. గోవుల నిలయం!

- ప్రమాదాలకు నెలవుగా కడప – తిరుపతి హైవే
- ఆవుల మందతో కోడూరు పట్టణంలో ట్రాఫిక్ మరింత జటిలం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న నాయకులు, అధికారులు



గుంతలమయమైన కడప – తిరుపతి జాతీయ రహదారి



కోడూరు పట్టణంలో ప్రధాన రహదారిపై తిష్ట వేసిన ఆవుల మంద

రైల్వేకోడూరు అర్బన్ : కడప – తిరుపతి జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లేవారు సైతం ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉంటుంది. రైల్వేకోడూరు పట్టణంతోపాటు మండల పరిధిలో ఉన్న జాతీయ రహదారి గోతులమయంగా తయారైంది. దీని అదనంగా ఆవులు రోడ్లపైనే తిష్ట వేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన సంఘటనలు అధికంగానే ఉన్నాయి. ఈ మార్గం గుండా రోజు రాకపోకలు సాగిస్తున్న అధికారులు, ప్రభుత్వ పెద్దలు మాత్రం తమకు ఇవేవి పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో వాహనదారులతోపాటు పట్టణ ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నాయి.

రోడ్డుపైనే ఆవుల మందలు

రైల్వేకోడూరు మీద రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలోని రహదారులపై ఆవులు మందలుగా ఉంటూ వాహన చోధకులకు ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవ్వడంతోపాటు తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం కూడా ఆవులు అడ్డురావడంతో ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక పైనం వరుణ్ (29)అనే యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అలానే హైవేపై ఉన్న గోతులు వర్షాలు, వాహన రద్దీ కారణంగా పెద్దగా మారి ప్రమాదాలకు నెలవుగా తయారయ్యాయి. రైల్వేకోడూరులో ఆవుల యజమానులు ఇళ్ల వద్ద వాటిని సంరక్షించుకోకుండా నిర్లక్ష్యంగా మూగజీవాలను రోడ్లపైకి విడిచిపెడుతుండటంతో భారీ వాహనాలు ఢీ కొంటూ గోవులు ప్రమాదానికి గురవుతున్నాయి.

నిర్లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధుల తీరు

ప్రధాన రహదారిలో డివైడర్‌కు ఇరువైపులా రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం అలాగే చిరువ్యాపారులు, ఆటోలు, బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆపివేయడం వంటి సమస్యలతోనే ఇబ్బంది పడుతుంటే దీనికి తోడు రద్దీ ప్రాంతాలలో ఆవులు గంటల తరపడి నిద్రిస్తుంటాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ సర్కిల్, రాజ్ రెసిడెన్సీ హోటల్, టోల్‌గేట్ వద్ద ఉదయం, సాయంత్రం పూట ఆవుల బెడద అధికంగా ఉంది. పోలీసులు, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా పట్టించుకొని సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులు పూడ్చాలి



జాతీయ రహదారిపై నిత్యం వాహన రద్దీ ఉంటుంది. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు రహదారిపై ఎక్కడా కనిపించడంలేదు. ఈ మార్గం గుండా తిరుపతికి ప్రయాణం చేయాలంటే ఒళ్లు గుల్ల చేసుకోవాల్సి వస్తోంది. గోతులు అధికంగా ఉంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు అధికారులు, నాయకులు హైవేపై ఉన్న గుంతలను(గోతులను) పూడ్చాలి.

– కాకర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు

ఆవులు రోడ్డుపై రాకుండా చూడాలి



ఆవుల మంద కారణంగా పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఆవుల యజమానుల నిర్లక్ష్యంతో అవి రోడ్డుపై తిష్టవేస్తున్నాయి. అధికారులు వాటి యజమానులతో మాట్లాడి ఆవులు రోడ్డుపై రాకుండా చర్యలు చేపట్టాలి. లేకుంటే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది. రోడ్డు భద్రతను అధికారులు కఠినంగా అమలు చేసి వాహనదారులకు అవస్థను తప్పించాలి.

– దార్ల రాజశేఖర్, రెడ్డివారిపల్లి, సీపీఐ కార్యదర్శి, రైల్వేకోడూరు

చర్యలు తీసుకుంటాం



రైల్వేకోడూరు పట్టణంలో వాహనాలు అధికంగా తిరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ స్థలం లేకపోవడం చిరు వ్యాపారులు రోడ్లపైకి వచ్చేస్తున్నారు. అలాగే బైపాస్ రోడ్డు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడు ఆవులు పదుల సంఖ్యలో రోడ్లపైనే ఉంటున్నాయి. వాటి యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చేపట్టాల్సిన అన్ని చర్యలను తీసుకుంటాం.

– నవీన్‌బాబు, ఎస్ఐ, రైల్వేకోడూరు

దేశ నిర్మాణంలో సీపీఐది క్రియాశీలక పాత్ర



పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు

రాయచోటి అర్బన్ : దేశ నిర్మాణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) క్రియాశీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ అన్నమయ్యజిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ శత వార్షికోత్సవ వేడుకల పోస్టర్లను ఆయన పార్టీ నేతలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తిచేసుకుని వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో సంవత్సరం పొడవునా వాడవాడలా శత వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. సీపీఐ నేతలు ఎంతోమంది భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అశువులు భాశారన్నారు. పేదలకు భూములు, భుక్తి, విముక్తి కోసం పోరాటాలు చేసిన ఘన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. జిల్లా లో తెగిపోయిన అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలంటూ తెలియజేశారు. వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన లాంటి ప్రాజెక్టులకు హంద్రీ – నీవా సుజల స్రవంతి జలాలను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కడప – బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణం కోసం వెంటనే నిధులు కేటాయించాలంటూ డిమాండ్ చేశారు. సీపీఐ శత వార్షికోత్సవ వేడకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వనాథ నాయక్, జక్కల వెంకటేష్, కోటేశ్వరరావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవమైన ఎన్జీఓ సంఘం తాలుకా ఎన్నికలు



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఎన్జీఓ తాలుకా అధ్యక్షులుగా కొండూరు బలరామరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, కడప జిల్లా ఎన్జీఓ అధ్యక్షులు బి.శ్రీనివాసులు తెలియజేశారు. ఆదివారం మండలంలోని స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఎన్జీఓ తాలుకా సంఘ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టి.తిమ్మారెడ్డి, సహాయక అధికారిగా ఎస్.రాజశేఖర్, పరిశీలకులుగా రవికుమార్‌లు వ్యవహరించారు. ఒక్కో పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అన్ని పదవులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి తిమ్మారెడ్డి ప్రకటించారు. అధ్యక్షులుగా కె.బలరామరాజు, సహాయాధ్యక్షులుగా ఆర్.జయచంద్ర, కార్యదర్శిగా సి.విశ్వనాథం, కోశాధికారిగా ఇ.రవీంద్ర నాయక్, ఉపాధ్యక్షులుగా పి.నీలోఫర్ బేగం, పి.రామకృష్ణ, ఎం.సురేంద్ర రెడ్డి, ఎస్.దేవదానం, జాయింట్ సెక్రటరీలుగా వై.కృష్ణప్ప, వి.వెంకటలక్షుమ్మ, ఎస్.గౌసియా బేగం, ఎ.సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.అంజనమ్మ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎస్.సాహెబ్ పీర్, వి.రామ తులసీ, జి.అరుణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం కడప జిల్లా ఎన్జీఓ అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీఓ సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటుందని, ఉద్యోగుల డిమాండ్లను నూతన ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బలరామరాజు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మూడోసారి లక్కిరెడ్డిపల్లి తాలుకా ఎన్జీఓ అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నందుకు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులకు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్‌కు, తాలుకాలోని ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మాజీ ఎన్జీఓ నేతలు వి.వెంకటరమణ, డి.రవిశంకర్ ప్రసాద్, రాయచోటి ఎన్జీఓ సెక్రటరీ డి.వెంకటేశ్వరరెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

31 నుంచి శ్రీ కేవలానంద ఆరాధనోత్సవాలు

రామాపురం : మండల కేంద్రంలో వెలసిన శ్రీ కేవలానంద లక్ష్మనార్య స్వామి ఆరాధన ఉత్సవాలు ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలో కేవలానంద స్వామి ఓ ప్రఖ్యాత గురువు, ఈ ఆరాధన ఉత్సవాలు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ, ముస్లిం అనే భేదభావం లేకుండా ఈ ఆరాధన ఉత్సవాలకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటారు. అలానే ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులూ అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవాలను చన్నమరాజు మనవాళ్లు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది.

పెనగలూరు చెరువుకు చెయ్యేరు నీరు



సిద్దవరంలోని చెయ్యేరు నది వద్ద జరుగుతున్న నీటి మళ్లింపు పనులు



తూములు ఎత్తి పెనగలూరు చెరువుకు నీటిని వదులుతున్న రైతులు

పెనగలూరు : పెనగలూరు చెరువు పూర్వ కళను సంతరించుకోనుంది. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు దెబ్బతినడంతోపాటు చెయ్యేరు జగతికట్ట కూడా మండలంలో తెగిపోవడంతో పెనగలూరు చెరువుకు అధిక మొత్తంలో నీరు వచ్చింది. దీంతో పెనగలూరు చెరువుకట్ట దెబ్బతినడంతో చెరువులోని నీరు వృథాగా పోయాయి. అప్పటి నుంచి పెనగలూరు చెరువుకు చుక్కనీరు రాలేదు. ఈ కారణంగా చెరువు కళావిహీనంగా మారడమే కాక వ్యవసాయం చేసుకునే రైతులను ఇబ్బందులకు గురి చేసింది. ఇటీవల జరిగిన ఎన్నికలలో మాజీ చైర్మన్ అబ్బినేని సుబ్బరాయుడు తిరిగి చైర్మన్‌గా ఎన్నికవ్వడంతో తన స్వంత నిధులతో పెనగలూరు చెరువుకు నీటిని మళ్లించే పనులను ఆదివారం చేపట్టారు. సిద్దవరం వద్ద ఉన్న చెయ్యేరు నది నుంచి జేసీబీ సాయంతో పనులు చేయించి నీటిని పెనగలూరు చెరువుకు వెళ్లే కాలువలకు నీటిని పంపేలా చేశారు. దీంతో మండల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరితే భూగర్భ జలాలు పెరిగి రైతులు పంటలను సాగు చేసేకునేందుకు ఇక్కట్లు తీరనున్నాయి. కాగా గత రెండు నెలల కాలంలో బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను, అల్పపీడనాల ప్రభావంతో మండలంలో చెప్పుకోదగ్గ వర్షం కురవలేదన్న సంగతి విదితమే.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



రాయచోటి టౌన్: సేవలకు సహకరించిన వారిని సన్మానిస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. అలాగే మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు అందించేందుకు ఆ పాఠశాల వ్యాయాయ ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, జగదీశ్వరయ్యలకు ఆర్థిక సహకారం చేశారు. అనంతరం గత నెలలో ఉత్తమ సేవలు అందించిన సభ్యులు వెంకట్రామిరెడ్డి, హరినాథరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి వ్యవస్థాపకుడు హరినాథరెడ్డి, అధ్యక్షులు ఖాదర్ బాషా, అంకం జయచంద్రారెడ్డి, చింతం వెంకట్రామిరెడ్డి (బాబు), వెంకటరమణ, నిమ్మనపల్లె సహదేవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, షకీల్, ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, గుండ్లపల్లె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



లక్కిరెడ్డిపల్లి: ఏపీ ఎన్జీఓ సంఘం తాలుకా అధ్యక్షుడు బలరామరాజును సన్మానిస్తున్న సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఆ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ సంస్థ నెలవారీ సమావేశానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ కమిటీ డైరెక్టర్ వై.ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించేందుకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఎన్జీఓ సంఘం తాలుకా అధ్యక్షుడిగా ఎన్నికైన బలరామరాజును మానవత సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మానవత డైరెక్టర్ రమణరావు, పి.రవిశంకర్, బి.శ్రీనివాసులు, శంకర్ ప్రసాద్, షఫీ నాయక్, వివి రమణ, రామకృష్ణ, వీఆర్ఓ కృష్ణయ్య, గంగయ్య, రామచంద్ర పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్‌కు శివశంకర్



రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న శివశంకర్ అనే ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ (రాష్ట్రస్థాయి) యూత్ ఎక్స్ఛేంజ్‌కు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఎన్ఎస్ఎస్ అధికారులు వెంకటనరసయ్య, డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి రెండవ తేది నుంచి ఐదు రోజులపాటు విశాఖపట్నంలోని నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్‌లో శివశంకర్ పాల్గొంటారని వారు తెలిపారు. కాగా శివశంకర్‌కు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం అభినందనలు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు ఎన్ఎస్ఎస్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

మల్లయ్యకొండకు వంట పాత్రలు వితరణ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి మద్దిమాకులపల్లెకు చెందిన ఏ.భువనేశ్వరరెడ్డి వంటపాత్రలు వితరణగా ఇచ్చారు. ఆదివారం భువనేశ్వరరెడ్డి కుటుంబీకులతో ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విశేష పూజలందుకున్న అమ్మవార్లు



పూజలందుకున్న ఇరుగులమ్మ మూలవిరాట్‌లు



ప్రత్యేక అలంకరణలో సంబేపల్లె నల్లగంగమ్మ

సిద్దవటం : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అయిన ఇరుగులమ్మకు ఆదివారం భక్తులకు విశేష పూజలు చేశారు. మండల కేంద్రం శివారులో మూలపల్లె క్రాస్ వద్ద కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. ఆలయ పూజారి వెంకటరమణ ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నల్లగంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : లోక పావని.. జగజ్జనని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆదివారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చింది. మండల కేంద్రం శివారులో కొలువైన అమ్మవారి దర్శనార్థం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేసి మూల మూర్తికి పూజలు చేసి అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు బీజాక్షరాలతో కూడిన మహిమ గల రాయికి పూజలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందును ఆరగించారు.

తొమ్మిదైనా తెల్లవారదే!



మండలంలోని ఓ గ్రామంలో పొగమంచు కారణంగా కనిపించకుండా పోయిన రోడ్డు మార్గం

రోజురోజుకి చలి తన పంజా విసురుతోంది. గత నాలుగు రోజులుగా చలి తీవ్రత భారీగా పెరిగింది. ఉదయం తొమ్మిది గంటలైనా సూర్యుడిని పొగమంచు కప్పేస్తోందా అనేలా పరిస్థితి కనిపిస్తోంది. రాయచోటి చుట్టుపక్కల ప్రాంతాల్లో చలి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇంటి పనులు చేసుకునే మహిళలు తమ పనులు ఆలస్యంగానే మొదలెడుతున్నారు. దట్టంగా పొగ మంచు అలుముకుంటుండటంతో వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. ఎదురుగా వస్తున్న వాహనాలు, రోడ్డుపై ఉన్న మలుపులు కన్పించకపోతుండటంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. చలి తీవ్రత అధికంగా ఉంటుందని, జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య ఇబ్బందులు తప్పవని వెచ్చని నీరు, స్వెటర్‌లు, అత్యవసరం అయితే తప్ప ఉదయం పూట బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు.

– రాయచోటి టౌన్



ఉదయం తొమ్మిది గంటలు అవుతున్నా.. పొగ మంచు కారణంగా జాడ లేని సూర్య భగవానుడు

అలంకరణలో నాగారపమ్మ



దర్శనమిస్తున్న నాగారపమ్మ

సుండుపల్లె : సంతానం ప్రసాదించే తల్లిగా పూజలందుకుంటున్న శ్రీ నాగారపమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లిలో వెలసిన అమ్మవారిని ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు, తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.